నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

షాద్‌నగర్‌రూరల్, జనవరి18(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం దేవుని పల్లి గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. 19న ఉదయం 5 గంటలకు విశేష అభిషేకం, అలంకరణ, యాగశాల ప్రవేశం ఉంటుంది. 20న స్వామివారి కల్యాణం, మంగళ శాసనాలు, తీర్థ ప్రసాదాలు, బలిహరణం ఉంటుంది. 21న ఉదయం 5గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం బండ్లు తిరుగు కార్యక్రమం ఉంటుంది.

సాగుభూముల లెక్క పక్కాగా ఉండాలి

డీఏవో నర్సింహారావు



సర్వేను పరిశీలిస్తున్న డీఏవో

ఆమనగల్లు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలులో భాగంగా చేపట్టిన భూ సర్వేను పక్కాగా చేపట్టాలని అధికారులకు జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు సూచించారు. శనివారం ఆమనగల్లులోని రైతు వేదికలో రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమై మాట్లాడారు. రెవెన్యూ మ్యాపుల ఆధారంగా సాగు భూములను గుర్తించాలన్నారు. ఈ నెల 20 నుంచి నిర్వహించే గ్రామసభల్లో సాగుకు యోగ్యం కాని భూముల జాబితాను ప్రదర్శించాలని చెప్పారు వీటిపై ఏమైన అభ్యంతరాలుంటే స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు చెన్నకేశవులు, ఏఈవోలు నివిత తహసీల్దారు లలిత, ఏవో శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.



రోగ నిర్ధారణకు పరీక్ష!

వికారాబాద్ డయాగ్నోస్టిక్ హబ్‌కు జబ్బు

- పాడైన యంత్రాలు.. పట్టించుకోని అధికారులు
- ప్రత్యామ్నాయం లేక రోగుల ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లాలో పేదలకు తప్పని రక్త పరీక్షల భారం
- ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న డయాలసిస్ పేషెంట్లు

వికారాబాద్‌లోని రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రంలో పాడైన మిషన్లు



వికారాబాద్‌లోని రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రం

రంగారెడ్డి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వైద్య ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పథకంలో భాగంగా తెలంగాణ డయోగ్నస్టిక్స్ హబ్ సేవలు 2018 జనవరిలో ప్రారంభమయ్యాయి. తొలుత హైదరాబాద్‌కే పరిమితమైన ఈ సేవలను ఆ తర్వాత అన్ని జిల్లాలకు విస్తరించాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నిరుపేదలకు వైద్య పరీక్షల భారాన్ని తగ్గించేందుకు ఏర్పాటైన తెలంగాణ డయాగ్నస్టిక్స్ హబ్‌కు జబ్బు చేసింది. వీటి పనితీరు అస్తవ్యస్తంగా మారింది. తరచూ యంత్రాలు మొరాయిస్తున్నాయి. గత 12 రోజుల నుంచి హబ్‌లో యంత్రాలు పని చేయడం లేవు. ఒకే మిషన్ ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక మిషన్ పాడైతే.. మరో మిషన్ లేదు. ప్రత్యామ్నాయ మార్గం లేక పోవడం.. ఉన్న మిషన్‌నే మరమ్మతులు చేయించడం.. మరమ్మతుల కోసం సుమారు 15 రోజులు పట్టడంతో

మిగతా 8వ పేజీలో...

ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదకరం

కలెక్టర్ నారాయణరెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) అతివేగం, అజాగ్రత్తతో డ్రైవింగ్ చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ ట్రాఫిక్ కమిషనర్, రాచకొండ ట్రాఫిక్ కమిషనర్, ఆర్‌అండ్‌బీ అధికారులతో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు 2025, రోడ్డు సేఫ్టీకి సంబంధించిన వివిధ విషయాలపై సమీక్షించారు. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై రాచకొండ, సైబరాబాద్ ట్రాఫిక్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రతీ మండలంలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రమాదం జరిగిన వెంటనే ప్రమాద స్థలానికి చేరుకోవాలని, ప్రమాదానికి కారణమైన వివరాలను సేకరించి ప్రత్యామ్నాయ చర్యల కోసం పైఅధికారులకు తెలిపే విధంగా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో సంగీత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్ మోహన్, ట్రాఫిక్ అధికారులు, ఆర్టీసి ఆర్‌ఎమ్, ఆర్‌అండ్‌బీ పాల్గొన్నారు.

డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించాలి

ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం

శంషాబాద్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే విమాన ప్రయాణిలతో క్యాబ్ డ్రైవర్లు మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ కె.నాగభూషణం సూచించారు. రోడ్డు సేఫ్టీ మాసోత్సవాల్లో భాగంగా శనివారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రాఫిక్ సీఐ రాజు ఆధ్వర్యంలో క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పక కలిగి ఉండాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. ట్రాఫిక్ సీఐ రాజు మాట్లాడుతూ.. నిబంధనలు పాటించని క్యాబ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు క్యాబ్ డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్డును కూల్చొద్దంటూ.. అన్నాదమ్ముల ఆత్మహత్యాయత్నం

- ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా అడ్డుకున్న మున్సిపల్ సిబ్బంది
- అనుమతులు లేని నిర్మాణాల కూల్చివేతకు అధికారుల చర్యలు
- ఇబ్రహీంపట్నంలో ఘటన



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న రవి, పక్కన సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ చౌరస్తా వద్ద అనుమతులు లేకుండా నిర్మించిన ఓ రేకుల షెడ్డును శనివారం మున్సిపల్ అధికారులు కూల్చడానికి పూనుకోగా.. నిర్మాణదారులు అడ్డుపడి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. దాంతో మున్సిపల్ సిబ్బంది, అక్కడున్నవారు అడ్డుపడ్డారు. వివరాల్లోకి వెళితే ఇబ్రహీపట్నం మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెం.368లో గతంలో స్వామి అనే వ్యక్తి నుంచి డి.రవి ఆయన సోదరుడు సత్యనారాయణ 102 గజాల స్థలం కొనుగోలు చేశారు. అయితే, అప్పటికే ఇందులో కొంత స్లాబ్‌తో నిర్మాణం ఉంది. కాగా, అందులోని మరికొంత స్థలంలో రేకుల షెడ్డు నిర్మాణం చేసి చికెన్ సెంటర్‌కు అద్దెకిచ్చారు. అనుమతులు లేకుండా నిర్మాణం చేశారని.. దానిని తొలగించాలని మున్సిపల్ అధికారులు వారికి నోటీస్ అందజేసి జేసీబీ సాయంతో కూల్చివేతకు పూనుకున్నారు. దాంతో రవి, సత్యనారాయణలు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు వచ్చి వారికి సర్ది చెప్పారు. ఈ నిర్మాణంపై ఫిర్యాదులున్నాయని, అనుమతులు తీసుకొని నిర్మాణం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్ వారికి సూచించారు.

భక్తిశ్రద్ధలతో కత్మేఖురాన్

ముగిసిన జేపీ దర్గా ఉర్సు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మసీవుల్లా

కొత్తూర్, జనవరి 18:(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు ముగిసింది. మూడో రోజు శనివారం కత్మేఖురాన్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా ఆవరణలోని మజీద్‌లో దర్గా సూపరింటెండెంట్ సత్తార్ ఆధ్వర్యంలో ముస్లిం గురువులు ఖురాన్ పఠనం చేశారు. అనంతరం ఫాతేహాలు ఇచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించడంపై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పోలీసులను అభినందించారు.

దర్శించుకున్న మాజీ హోంమంత్రి మహమూద్ అలీ

జేపీ దర్గాను మాజీ హోంశాఖ మంత్రి మహముద్‌అలీ దర్శించుకున్నారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మసీవుల్లాతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకు ముందు చాదర్లను తలపై పెటుకుని మేళతాళాలతో ఊరేగింపుగా రాగా, ముజావర్లు వారికి తలపాగా చుట్టి స్వాగతం పలికారు. ముజావర్లు వారికి ఆశీర్వాచనలు అందజేసి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహమూద్‌అలీ మాట్లాడుతూ జేపీ దర్గాను దర్శించుకుని మాస్టర్ ప్లాన్ కోసం రూ.50కోట్లు మంజూరు చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని 50ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు దర్గా అభివృద్ధిని విస్మరించాయని దుయ్యబట్టారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దర్గా అభివృద్ధికి నయా పైసా కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ కాంగ్రెస్ నాయకులు పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ మసిఉల్లా మాట్లాడుతూ దర్గా అభివృద్ధిలో షాద్‌నగర్ ఎమ్మెల్యే అవాస్తవాలు మాట్లాడుతున్నారని అన్నారు. దర్గా అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.50కోట్లు మంజూరు చేసినా ప్రస్తుత ప్రభుత్వం పనులు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, శంషాబాద్ జోన్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఎస్ఐలు శ్రీనివాస్, మురళీగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వి.నారాయణరెడ్డి, మాజీ సర్పంచులు మిట్టునాయక్, అజయ్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు రాంబాల్‌నాయక్, ఎమ్మె సత్యనారాయణ, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, బి.దేవేందర్‌యాదవ్, పెంటనోళ్ల యాదగిరి, మెండె కృష్ణ, సత్తయ్య, గోపాల్‌నాయక్, తస్లీం, శ్రీరాములు యాదవ్, పెంటనోళ్ల రవికుమార్, ఇంద్రాసేనారెడ్డి, కుమార్, సల్లా యాదగిరి పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు షాద్‌నగర్ వాసి

సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్ నుంచి ఆహ్వానం



రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనాలని షాద్‌నగర్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఫిబ్రవరి మొదటి వారంలో జరగనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో అర్బన్ డెవలప్‌మెంట్ స్ట్రాటజీ అండ్ క్లైమెట్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు రవీందర్‌రెడ్డి శనివారం వెల్లడించారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి అనేక మంది అధ్యాపకులు అర్బన్ డెవలప్‌మెంట్ స్ట్రాటజీ అండ్ క్లైమెట్ అనే అంశంపై పరిశోధన పత్రాలను యూనివర్సిటీకి అందజేశారని ఆయన తెలిపారు. తాను కూడా ఇదే అంశంపై రాసిన పరిశోధన పత్రాన్ని సింగపూర్ యూనివర్సిటీకి సమర్పించగా.. దానిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాల్సిందిగా అక్కడి నుంచి ఆహ్వానం అందిందని చెప్పారు. సింగపూర్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సుకు రవీందర్‌రెడ్డి ఎంపిక కావడంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రొఫెసర్ హరగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డిని అభినందించారు.

భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలి



తిమ్మాపురంలో రైతులతో సమావేశమైన భూసేకరణాధికారి రాజు

కందుకూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం భూమి కోల్పోతున్న వారిని అన్నివిధాలా ఆదుకోవాలని, భూమికి భూమి ఇవ్వాలి, లేదా బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం అందించాలని తిమ్మాపురం రైతులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు రైతులతో సమావేశమయ్యారు. తిమ్మాపురంలో 47 ఎకరాల భూమిని 29 మంది రైతుల నుంచి 330 ఫీట్ల రోడ్డుకు తీసుకోవడానికి అభిప్రాయాలు తీసుకున్నారు. భూసేకరణ అధికారి మాట్లాడుతూ రైతుల డిమాండ్‌ను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, రైతులతో మరోమారు సమావేశం ఏర్పాటు చేసి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో తహసీల్దారు గోపాల్, ఆర్ఐ యాదగిరి, మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, గణేష్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు.


భూసేకరణ ఆపాలి


ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి



నానక్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కవుల సరస్వతి

యాచారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా కంపెనీల కోసం కొత్తగా భూసేకరణ చేయడం ఆపేయాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యాచారం మండలం నానక్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫార్మాసిటీని రద్దు చేసి రైతులను ఆదుకోని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ రద్దు చేస్తామని, సేకరించిన భూమిని తిరిగిచ్చేస్తామని కాంగ్రెస్ నాయకులు రైతులను మోసం చేశారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రెండేళ్ల క్రితం మేడిపల్లిలో జరిగిన సభలో రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చి, ఇప్పుడు అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదని చెప్పారు. సమావేశంలో హైకోర్టు న్యాయవాది జబీ ఇస్మాయిల్, తెలంగాణ పీపుల్స్ జాయింట్ కన్వీనర్ రవి కన్నెగంటి, విశ్రాంత రసాయనశాస్త్రవేత్త డాక్టర్ కె. బాబురావు, రాష్ట్ర మానవ హక్కుల వేదిక కన్వీనర్ సాజిద్, వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.







శ్రీవిష్ణుశివాలయంలో ప్రత్యేక పూజలు

మూడుచింతలపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దె మర్రి గ్రామ పరిధిలో ఉన్న శ్రీ విష్ణుశివాలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టేకుల కమలమ్మ హన్మంత్‌రెడ్డిలు ఘనంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ బలోపేతానికి అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ అన్నారు. శనివారం ప్రభుత్వ లెక్చరర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత అధ్యాపకులదేన్నారు. ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్‌రావు, సురేశ్వర స్వామి, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి మంజుల, ఉపాధ్యక్షుడు మల్లినాదప్ప, స్టేట్ కౌన్సిలర్ పండరి, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి బుచ్చయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణం నాలుగు మండలాలకు ప్రధాన కూడలిగా ఉండడంతో ఇక్కడ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఆందోళన నిర్వహించారు. డివిజన్ కార్యాలయం సబ్‌రిజిస్ట్రార్, సబ్‌ట్రెజరీ, ఆర్‌డీవో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ తహల్దారు లలితకు వినతిపత్రమందించారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు నాయకులు చెక్కాల లక్ష్మణ్, చెన్నకేశవులు, కృష్ణయాదవ్, శ్రీ శైలం యాదవ్, గోరేటి నర్సింహ, గిరియాదవ్, రాజు, రవి రాథోడ్, నాగిల్లలక్ష్మణ్, అశోక్, అ మర్, సంతోష్ తదితరులున్నారు,

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యం

శామీర్‌పేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చదువు పూర్తి చేశాక గొప్ప గొప్ప సంస్థల్లో ఉన్నత ఉద్యోగాలు పొందే విధంగా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడమే సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ లక్ష్యమని డైరెక్టర్ డాక్టర్ సీతామూర్తి అన్నారు. మండలంలోని లాల్‌గడి మలక్‌పేట పరిధిలోని శ్రేష్ఠ రిసార్ట్స్, స్పోర్ట్స్ అకాడమిలో ఆ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ సీతామూర్తి ఆధ్వర్యంలో శుక్ర, శనివారాలు రెండు రోజుల వర్క్ షాపును నిర్వహించారు. రెండో రోజు శనివారం నిర్వహించిన వర్క్‌షాపులో డైరెక్టర్ సీతామూర్తి మాట్లాడుతూ తమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భవిష్యత్‌లో అత్యున్నత స్థాయిలో వివిధ వృత్తుల్లో ఉద్యోగాలను పొంది ఎదిగేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో లీడర్‌షిప్ లక్షణాలను, గొప్పనైపుణ్యతను సాధించేలా మార్పులను తీసుకురావాలన్నదే తమ ఆశయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలకు చెందిన డైరెక్టర్ ధనంజయ, ప్రిన్సిపాళ్ళు రచనశర్మ, ఉమాదేవి, సునీత, శోభ, కోర్డినేటర్లు పాల్గొన్నారు.

చర్లపల్లి జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు

కుషాయిగూడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి జైలు కేంద్ర కారాగారాన్ని శనివారం న్యాయ సేవాధికార సంస్థ అధికార బృందం సందర్శించింది. తెలంగాణ రాష్ట్ర గౌరవ కార్యదర్శి సిహెచ్.పంచాక్షరి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గౌరవ కార్యదర్శి డి.కిరణ్ కుమార్ సెంట్రల్ జైలులో పర్యటించారు. జైలులో ఖైదీలకు అందజేస్తున్న చికిత్సలు, అధునాతన కిచెన్, 'మైనేషన్' బ్రాండ్‌తో తయారు చేస్తున్న వివిధ ఫ్యాక్టరీ ఉత్పత్తులు, నర్సరీ, ఖైదీల బ్యారక్‌లను వారు పరిశీలించారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జైలులో చేపడుతున్న కార్యక్రమాలను సూపరింటెండెంట్ జి.రామచంద్రం వారికి వివరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డి.కాళిదాస్, వి.శశికాంత్, జి.రత్నం, ఇతర అధికార సిబ్బంది వారి వెంట ఉన్నారు.



ఏకాగ్రతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ, పోలీస్ సిబ్బంది, ఆర్టీఏ అధికారులు

పరిగి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వాహనాలను నడిపించడంలో ఏకాగ్రత, అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని పరిగి డీఎస్పీ నేతి శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం పరిగిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పల్లవి కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. వాహనదారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతుంటాయని చెప్పారు. అతివేగమే ప్రధాన కారణమని తెలిపారు. ఒక సెకన్ నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాల నష్టాలను పూడ్చలేమన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ నడిపించాలని సూచించారు. పరిగి ఎంవీఐ వీరేందర్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రతీ డ్రైవర్ ఆర్టీఏ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏటా ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగించే విషయమని చెప్పారు. ఇన్స్‌రెన్స్, లైసెన్స్, ఆర్సీ, ఫిట్‌నెస్ కచ్చితంగా ఉండేలా చూసురోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖ అధికారి హన్మంత్‌రావు, యువజన సర్వీసుల శాఖ అధికారి ఈశయ్య, ఎస్‌ఐ సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన కొడంగల్ జట్టు

కొడంగల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొడంగల్ పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ కబడ్డీ పోటీలు ముగిశాయి. పోటీల్లో మొత్తం 23జట్లు పాల్గొని హోరా హోరీగా తలపడ్డాయి. శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో కొడంగల్ ఎస్టీ హాస్టల్ జట్టు వర్సెస్ హసేన్‌పూర్ జట్టు తలపడ్డాయి. అందులో కొడంగల్ ఎస్టీ హాస్టల్ బాలుర జట్టు టైటిల్ విజేతగా నిలిచింది. రన్నర్‌గా హసేన్‌పూర్ జట్టు, తృతీయ స్థానంలో అప్పాయిపల్లి జట్టు, 4వ స్థానంలో ముథేల్ జట్టు నిలిచాయి. యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు చేతుల మీదుగా నిర్వాహకులు విజేత జట్టుకు రూ.30వేలు, రన్నర్‌కు రూ.20వేలు, 3వ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు, 4వ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5వేలు నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు.

వైభవంగా ఊరడమ్మ జాతర



మర్పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచన్‌పల్లి గ్రామంలో ఊరడమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామ మహిళలు బోనాలతో గ్రామంలోని వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాల నడుమ బోనాలతో ఆలయానికి చేరుకొని ప్రత్యేక నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ దేవత ఊరడమ్మకు ఆదివారం అభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలి



సాయన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సోదరులు

చేవెళ్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను ప్రభుత్వం బీసీ- ఏలో చేర్చాలని రాష్ట్ర ముదిరాజ్ సంఘ నాయకుడు డాక్టర్ శివరాజ్ డిమాండు చేశారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని కోరుతూ ఆయన చేపట్టిన బస్సు చైతన్య యాత్ర శనివారం చేవెళ్లకు చేరుకుంది. ఈ సందర్భంగా పండుగల సాయన్న విగ్రహానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చుతానని గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అదేవిధంగా ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ను అమలు చేసి స్థానిక ఎన్నికల్లో పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నర్సింలు, యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు గోపాల్, రాంప్రసాద్, శ్రీనివాస్, గణేష్, కృష్ణమోహన్, నరేష్, శివకుమార్, నవీన్, భార్గవ్, రాజు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను బెదిరించిన వారిపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్ రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ వర్గీకరణ కోరేవారిని బహిష్కరించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని, బహిరంగంగా మందకృష్ణ మాదిగను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.నర్సింహ మాదిగ, నాయకులు ఆనంద్ మాదిగ, శ్రావణ్‌కుమార్ మాదిగ, భూషన్ మాదిగ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల భూములను కాపాడండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన దివ్యాంగులు

కందుకూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల భూములను కబ్జాచేసిన వారిని దివ్యాంగుల చట్టం ప్రకారంగా దండించడంతో పాటు వారి భూములు ఇతరులు కబ్జా చేయకుండా చొరవ తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కోర్‌కమిటీ చైర్మన్ గోపాల్‌రావు అధికారులను కోరారు. శనివారం కందుకూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట మండల పరిధిలోని దివ్యాంగులతో బైఠాయించారు. ఆ యన మాట్లాడుతూ మండలంలోని తిమ్మాయపల్లికి చెందిన గొర్రెంకల యాదయ్య, ఎడ్ల కిష్టయ్యలు అదే గ్రామానికి చెందిన పద్మావతి, హైమావతి, పరమేశ్వరి, రామేశ్వరిలపై దౌర్జన్యం చేసి వారికున్న 9ఎకరాల 16 గుంటల భూమిని కబ్జా చేయడం దారుణమన్నారు. దివ్యాంగులకు న్యాయంచేయడానికి రెవెన్యూ అధికారులు గ్రామంలో విచారణ చేసి వారిని ఆదుకోవాలని కోరారు. మహిళా దివ్యాంగులకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కమ్మేస్తున్న కాలుష్యం

ఆదిభట్ల, పట్నంలో జనావాసాల మధ్యే పరిశ్రమలు

- విషవాయువులతో విలవిలలాడుతున్న ప్రజలు
- కలుషితమవుతున్న గాలి, భూగర్భ జలాలు
- అనారోగ్యం బారిన పడుతున్న జనం

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శరవేంగా అభివృద్ధి చెందుతున్న ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. ఈ ప్రాంతాల్లో ఐటీ సంస్థలు, ప్రతిష్టాత్మకమైన ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్ తదితర భద్రత సంస్థలు స్థాపించబడ్డాయి. బీడీఎల్ లాంటి రక్షణ సంస్థలు నెలకొల్పబడ్డాయి. ఆదిభట్లలో టీసీఎస్, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాల తయారీ యూనిట్, టాటా లాకీడ్ మార్టీన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం లాంటి అంతర్జాతీయ సంస్థలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ఇంజనీరింగ్, పీజీ కళాశాలలకు ఈ ప్రాంతం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఫాక్స్‌కాన్, కేన్స్ లాంటి ఎలక్ట్రానిక్స్ కంపెనీలు వచ్చాయి. ఓ రకంగా చూస్తే ఇక్కడి గ్రామాల్లో సైతం పట్టణ వాతావరణం కనిపిస్తుంది. అలాంటిది ఈ ప్రాంతంపై కాలుష్య మేఘాలు కమ్ముకున్నాయి. గాలి కలుషితమై ఇక్కడి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

రోగాల బారిన ప్రజలు

పాతికేళ్ల క్రితం వరకు ఈ ప్రాంతం ప్రశాంతమైన వాతావరణంలో ఉండింది. కర్మన్‌ఘాట్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లులను జనావాసాలకు దూరంగా తరలించాలని అప్పట్లో ప్రభుత్వ ఆదేశాలతో మిల్లులు ఈ ప్రాంతానికి తరలివచ్చాయి. కాగా అప్పట్లో జనావాసాలకు దూరంగా వీటిని ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పుడు కాలనీలు విస్తరించడంతో ఇవి జనం మధ్యలో ఉండిపోయాయి. కొన్ని కంపెనీల నుంచి రాత్రి వేళల్లో వచ్చే పొగ భరించడం కష్టంగా ఉంది. కనీసం ఊపిరాడని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో నివసించే ప్రతీ 10 మందిలో ఐదుగురు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చిన్న పిల్లలు. వృద్ధులు అస్తమా, ఊపిరితిత్తుల సమస్య, ఎలర్జీ, మైగ్రేన్, బీపీ, గుండెపోటు తదితర సమస్యల బారినపడుతున్నారు. జనావాసాల మధ్య నుంచి కంపెనీలు, ఇటుక బట్టీలను తరలించాలని ప్రజలు కాలుష్య వ్యతిరేక పోరాట సమితిగా ఏర్పడి ఆందోళనబాట పడుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ ప్రాంతంలో నివసించడం కష్టమని పేర్కొంటున్నారు.



బొంగులూరు సమీపంలోని ఆయిల్ కంపెనీ నుంచి వస్తున్న పొగ

నిత్యం ఇబ్బందులు



జనావాసాల మధ్యలో ఉన్న రైస్ మిల్లులు, ఆయిల్ కంపెనీల నుంచి వెలువడే విషవాయువులతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. కంపెనీల నుంచి వచ్చే శబ్దాలతో రాత్రి వేళ నిద్రపట్టడం లేదు. అధికారులు స్పందించి కంపెనీలను ఇక్కడి నుండి తరలించాలి.

- బొడ్డు రవి, విజయలక్ష్మి కాలనీ, బొంగులూరు


జనావాసాలకు దూరంగా తరలించాలి



కాలుష్యకారక కంపెనీలను జనావాసాలకు దూరంగా తరలించాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కాలుష్యం వెదజల్లే కంపెనీలను ఇక్కడి నుండి షిఫ్ట్ చేయాలని అధికారులకు, ప్రజా ప్రతినిదులకు ఫిర్యాదు చేసి, ఉద్యమాలు చేపట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తాం.

- పయిల్ల తిరుమల్ రెడ్డి, బొంగులూరు

అనేక కంపెనీల ద్వారా..



మంగల్‌పల్లి, పోచారం, ఉప్పరిగూడ, బొంగ్లూరు, శేరిగూడలలో 32 రైస్ మిల్లులు ఉన్నాయి. ఇవిగాక ఎంపీపటేల్ గూడ, రాందాస్‌పల్లి, బొంగ్లూరు, కొంగరకలాన్, శేరిగూడ పరిసరాల్లో ఆయిల్, ఫ్లైవుడ్, ఇటుక బట్టీలు, రెడీమిక్స్ క్రషర్ మిషన్, కురుకురే తదితర కంపెనీలు మరో 40 వరకు ఉన్నాయి. ఈ కంపెనీల నుంచి వెలువడుతున్న విష వాయువులు, కెమికల్ వ్యర్థాలతో గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ముఖ్యంగా బొంగ్లూర్ సమీపంలోని అంతఃపురం, సప్తగిరి, విజయలక్ష్మి, రాఘవేంద్ర కాలనీలతో పాటు మైహోమ్స్, సీఎంఆర్ మీడోస్, గంగానగర్ కాలనీలతోపాటు శేరిగూడల వద్ద ఉన్న రైస్‌మిల్లుల కారణంగా దుమ్ముధూళి ఇళ్లలోకి చేరి ఆహార పదార్థాలు తినలేని పరిస్థితి నెలకొంది. అంతేగాక ద్విచక్ర వాహనాలు, కాలినడకన వెళ్తున్న వారి కళ్లల్లో దుమ్ముపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల మధ్య విష వాయువులు వెదజల్లే కంపెనీలను తరలించాలని మున్సిపాలిటీ అధికారులకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులకు అనేకమార్లు ప్రజలు విన్నవించారు. అయినా స్పందన లేదు. ఈ పరిశ్రమలు కనీస ప్రమాణాలు పాటించకపోవడంతో రోజురోజుకు వాతావరణం కలుషితమవుతోంది. కాలుష్యకారక కంపెనీలను ఇక్కడి నుండి తరలించాలని ప్రజలు రోడ్డెక్కి ఆందోళనలకు దిగుతున్నారు.

బీఆర్ఎస్ రైతు దీక్ష బూటకం

- పదేళ్లలో తెలంగాణను దోచుకున్న బీఆర్ఎస్
- కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్



రైతుదీక్ష సభ స్థలాన్ని శుభ్రం చేస్తున్న భీంభరత్ తదితరులు

షాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ షాబాద్‌లో నిర్వహించిన రైతుదీక్ష బూటకమని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. బీఆర్ఎస్ నిర్వహించిన రైతుదీక్ష సభ స్థలాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం శుభ్రం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మిగులు బడ్జెట్ కలిగి ఉన్న ప్రత్యేక తెలంగాణను పదేళ్లలో రూ.7లక్షల కోట్లు అప్పుల పాలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే వంటగ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 60వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీమేరకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. గతంలో కేసీఆర్ గుట్టలకు, తోటలకు రైతుబంధు వేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26 నుంచి పంట సాగుచేసే రైతుల భూములకు రైతుభరోసా అందజేస్తుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో చేవెళ్ల డివిజన్‌లో ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు అయినా వచ్చిందా అని ప్రశ్నించారు. చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లో పరిశ్రమల హబ్ పేరిట రైతుల వద్ద గుంజుకొని పెద్ద వారికి ఎక్కువ ధరకు అమ్ముకున్నారని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలకు బీఆర్ఎస్ మద్దతు పలికిందన్నారు. షాబాద్‌లో రైతుదీక్ష ఒక బూటకమని, అక్కడ రైతులు తిరగబడ్డారని, దీక్ష శిబిరానికి వచ్చిన జనాలను డబ్బులు ఇచ్చి తీసుకువచ్చారని అన్నారు. కేటీఆర్ ఈ-ఫార్ములా కేసులో రేపో మాపో జైలుకు పోవడం ఖాయమన్నారు. ఇప్పటి వరకు చేవెళ్ల నియోజకవర్గానికి రూ.8కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి గోరిసతీష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, ఏఎంసీ డైరెక్టర్ అక్తర్‌పాష, నాయకులు రాంరెడ్డి, చల్లా మాధవరెడ్డి, పీసరి వెంకటరెడ్డి, అస్మత్‌పాష, పెంటారెడ్డి, అశ్వక్‌అలీ, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

జనరల్‌బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

షాబాద్, చేవెళ్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో నిర్వహించే జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో మండల కార్యదర్శి నక్కలి జంగయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈనెల 28న చేవెళ్లలోని కేజీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే జనరల్ బాడీ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబ్‌పేట్ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, నాయకులు రాములు, శ్రీశైలం, నారాయణ, రుక్కయ్య, నర్సయ్య ఉన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

బీజేపీ కిసాన్‌మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్



బీజేపీ మహేశ్వరం మండల అధ్యక్షుడు యాదీష్‌ను సన్మానిస్తున్న నాయకులు


మహేశ్వరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కష్టపడ్డ ప్రతి కార్యకర్తను బీజేపీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని కిసాన్‌మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ అన్నారు. బీజేపీ మహేశ్వరం మండల అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన తెల్గమల్ల యాదీష్‌ను శనివారం మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారులను అత్యధిక సంఖ్యలో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మిద్దె సుదర్శన్‌రెడ్డి, అనంతయ్యగౌడ్, యాదయ్యగౌడ్, కాసాని వెంకటేష్‌గౌడ్, సుదర్శన్ యాదవ్, వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, మాదవాచారి, శంకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతి ఏడాది సగటున ఐదు లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జిల్లా రవాణా అధికారి వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్, కళాశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కారులో సీట్ బెల్ట్ వాడడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే అనేక ప్రాణాలను కాపాడవచ్చన్నారు. పాదాచారులు, డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్‌సిగ్నల్స్ పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐ జోసఫ్ హాల్ట్, వీరేంద్రనాయక్, సిబ్బంది, వాహనదారులు ప్రజలు పాల్గొన్నారు.

మేడ్చల్ ఏసీపీని కలిసిన బీజేపీ నాయకులు



ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డితో బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నూతనంగా మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్ష పదవి చేపట్టిన శైలజ హరినాథ్ శుక్రవారం మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీకి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మేడ్చల్ తహసీల్దార్ శైలజను కలిశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, వంశీధర్‌రెడ్డి, లవంగ శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి




వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులు ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయిలో రాణించాలని, క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ధృడత్వం లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం నందిగామ మండల పరిధిలోని మజీద్ మామిడిపల్లిలో మహబూబ్‌నగర్ వాలీబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మొదళ్లగూడ గ్రామానికి చెందిన చీకుర్తి సుదర్శన్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శంకర్ ప్రాంభించారు. సుదర్శన్‌ను ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అభినందించారు. నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింలు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కావలి కృష్ణ, నవీన్‌గౌడ్, అనిల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుదర్శన్, మోహన్‌సింగ్, సుధాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చెంగోల్ ఉన్నత పాఠశాలకు మహర్దశ

- ఊరగుట్ట తొలగించి ఆటస్థలం
- రూ.5లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే
- పరిశీలించిన పంచాయతీరాజ్ డీఈ

తాండూరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మహర్దశ పట్టింది. పాఠశాలకు ఆట స్థలం కోసం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిధులు మంజూరు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. చెంగోల్ ఉన్నత పాఠశాలకు ఆటస్థలం లేక విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు. అయితే ఈ విషయాన్ని గ్రామస్తులు పలుమార్లు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో పలువురు ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఆటస్థలం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గ్రామ శివారులోని ఊరగుట్టను ఆటస్థలంగా మార్చేందుకు నిర్ణయించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఊరగుట్టను తొలచేందుకు రూ.5లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో శనివారం పంచాయతీరాజ్ డీఈ నాగభూషణం చెంగోల్ ఊరగుట్టను పరిశీలించారు. గుట్ట ఎంత ఎత్తులో ఉందని, తొలగింపు చర్యలపై గ్రామస్తులను కలిసి మాట్లాడారు. పాఠశాలకు ఆట స్థలం ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల వెంట పంచాయతీ నాయకులు రాము యాదవ్, బలరాం ఉన్నారు.



చెంగోల్ గ్రామ శివారులోని గుట్టను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ నాగభూషణం

అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తాం



మొయినాబాద్ రూరల్ : చిన్నమంగళారంలో భూ సర్వేపై అధికారులతో చర్చిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

నందిగామ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ తప్పనిసరిగా రేషన్ కార్డులు అందిస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, మామిడిపల్లి, మొదళ్లగూడలో అధికారులు నిర్వహిస్తున్న గృహలక్ష్మి సర్వేలో పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొదళ్లగూడలో సక్కుబాయి అనే మహిళ.. మీకు ఓటు వేసానని గ్రామంలో కొందరు తన ఓటును తొలగించారని ఎమ్మెల్యేకు తెలపడంతో తహసీల్దార్‌కు ఎమ్మెల్యే అక్కడి నుండే ఫోన్‌చేసి సక్కుబాయి ఓటును పునరుద్ధరించాలని తెలిపారు. నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింలు, కొమ్ము కష్ణ, చంద్రపాల్‌రెడ్డి, తదితరులున్నారు.

మొయినాబాద్ రూరల్ : రైతు భరోసా, నూతన రేషన్‌కార్డుల జారీల విషయంలో లబ్ధిదారుల నుంచి పక్కాగా వివరాలు సేకరించాలని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ సూచించారు. చిన్నమంగళారం, కుత్బుద్దీన్‌గూడలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో కలిసి భూములను పరిశీలించారు. ఆర్‌ఐలు రోజు, అజిత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కేశంపేట : వ్యవసాయేతర భూములను పక్కగా గుర్తించాలని తహసీల్దార్ మీర్ ఆజంఅలీ సూచించారు. అల్వాలలో భూముల గుర్తింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల వ్యవసాధికారి శిరీష, ఏఈవో వినయ్ తదితరులున్నారు. రేషన్ కార్డుల సర్వేను ఎంపీడీవో పరిశీలించారు. కొనాయపల్లి, వేముల్‌నర్వలో సర్వే తీరును పరిశీలించారు.

ఆదిభట్ల : ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై ఈనెల 21, 22న వార్డుసభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ ప్రకటనలో తెలిపారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల ఎంపిక ఉంటుదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్న అర్జీదారులు సభలలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

బోనస్ డబ్బులు అందించేలా చొరవ తీసుకోవాలి

ఆమనగల్లు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్, వరి ధాన్యం డబ్బులు త్వరగా అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్ కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ధాన్యం విక్రయించిన రైతులకు నేటికీ బోనస్ డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. అదేవిధంగా ధాన్యం డబ్బులు కూడా నేటికి అందలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

- టీడీపీ నాయకులు
- రామారావు వర్ధంతి సందర్భంగా నివాళి



షాద్‌నగర్ : నివాళులర్పిస్తున్న పాతూరి వెంకట్‌రావు తదితరులు



మొయినాబాద్ రూరల్ : ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో నివాళులర్పిస్తున్న డీన్ రామారావు తదితరులు

ఆమనగల్లు/మొయినాబాద్ రూరల్/చేవెళ్ల/షాద్‌నగర్ రూరల్/కేశంపేట/షాద్‌నగర్/మంచాల/కందుకూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర నాయకుడు అండేకార్ యాదిలాల్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో జరిగిన నిర్వహించిన రక్తదాన శిబిరంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదానం చేసిన యాదిలాల్, టీడీపీ నాయకులకు నారా భువనేశ్వరీ ప్రశంసా పత్రాలు అందజేశారు. కండె సత్యం, శ్రీనాథ్, గాజుల పద్మనాభం, పంచాక్షరి, అర్థం నర్సింహ తదితరులున్నారు. రామారావు వర్ధంతిని ఆమనగల్లులో టీడీపీ జిల్లా అడహక్ కమిటీ సభ్యుడు కొప్పు యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కండె భాస్కర్, మారేపల్లి జంగయ్య, జగన్, సత్తయ్య, పాండునాయక్ తదితరులున్నారు. ఎన్టీఆర్ భారత రాజకీయాల సమాఖ్యీకరణ, ప్రజాస్వామ్యీకరణకు ఎంతో దోహదపడ్డారని ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు తెలిపారు. హిమాయత్ నగర్‌లోని ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో ఎన్టీఆర్ విగ్రహానికి డైరెక్టర్ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయ బృందం, ఉన్నారు. ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల కన్వీనర్ సభ్యులు సుభాన్ అన్నారు. చేవెళ్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాఘవులు, కత్తి మోదన్‌రావు, శ్రీహరియాదవ్, ధర్మయ్యచ కృష్ణయాదవ్ తదితరులున్నారు. రామారావు వర్ధంతి వేడుకలను ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ, కొండన్నగూడ, కమ్మదనం తదితర గ్రామాల్లో జరుపుకున్నారు. భాస్కర్‌రెడ్డి, భూపతిరెడ్డి, బక్కని శ్రీను, శివకుమార్, హనుమంతు తదితరులున్నారు. నిరుపేదల జీవితాలలో రామరావు వెలుగులు నింపారని టీడీపీ కేశంపేట మండలాధ్యక్షుడు చుక్క శేఖర్ గౌడ్ అన్నారు. కొత్తపేటలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రామ ఉపాధ్యక్షుడు గణేష్, నాయకులు శ్రవణ్ కుమార్, శ్రీను, ప్రసాద్, పరమేశ్, రవి, తదితరులున్నారు. రామారావు సేవలు చిరస్మరణీయమని టీడీపీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి చక్రపాణి అన్నారు. మంచాలలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండలాధ్యక్షుడు మహేందర్, కృష్ణ, కొంగర వెంకట్‌రెడ్డి, పగడాల ఆనంద్, పి.మల్లేష్, శంకర్, తదితరులున్నారు. నాయకులు ఎగ్గిడి సత్తయ్య, ఇంద్రకంటి రవీందర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో కందుకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ పెద్దరామయ్య, బొమ్మరాజు మల్లేష్, గణపురం అంజయ్య, గడల రాములు, గడిగ మహేందర్, గాది సత్తయ్య, తదితరులున్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కమ్మ సేవా సమితి అధ్యక్షులు పాతూరి వెంకట్‌రావు కోరారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధి చటాన్‌పల్లిలోని శేషయ్యనగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. షాద్‌నగర్ పట్టణ ప్రధాన కూడలిలో నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కమ్మ సేవాసమితి నాయకులు పినపాక ప్రభాకర్, వసంత్‌రావు, బండారుపల్లి నాగేశ్వర్‌రావు, నాయకులు గంధం ఆనంద్, వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : నివాళులర్పిస్తున్న నాయకులు

భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోండి

యాచారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫోర్త్ సిటీ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు తగిన పరిహారం చెల్లించి ఆదుకోవాలని మండల సీపీఎం నాయకులు కోరారు. శనివారం మంగలిగడ్డతండా, మర్లకుంటతండా, పోతుబండ తండాలలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. మండలంలో 144ఎకరాల 7 గుంటల భూమి రోడ్డు కోసం భూసేకరించారని, రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు 2013 చట్టం ప్రకారంగా పరిహారం అందించకపోతే భూములు వెనక్కిచ్చేయాలని కోరారు.

క్రైం కార్నర్

రెండు కార్లు ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

కందుకూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గూడూరు గేటు వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ ఘటన శనివారం కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కసిరెడ్డి విశాంత్‌రెడ్డి కారులో చంద్రయానంపల్లి నుంచి హైదరాబాద్ వెళుతుండగా గూడూరు గేటు వద్ద ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టాడు. దాంతో విశాంత్‌రెడ్డి కుడికాలు, కుడి భుజానికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు కర్మాన్‌ఘాట్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారాం చెప్పారు.

అంబులెన్స్ ఢీకొనడంతో మరొకరికి..

ఆమనగల్లు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి విఠాయపల్లి వద్ద శ్రీశైలం-హైదరాబాద్ ఎన్‌హెచ్‌పై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై వెంకటేష్ కథనం మేరకు.. పోలేపల్లికి చెందిన శిరగని లాలయ్య స్థానిక సూర్యలక్ష్మి కాటన్‌మిల్లులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. విఠాయపల్లిగేటు వద్ద ఉదయం టీ తాగడానికి వెళ్లి రోడ్డు పక్కన నిల్చున్నాడు. ఈక్రమంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళుతున్న అంబులెన్స్ వాహనం లాలయ్యను ఢీకొట్టింది. దాంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

పాత కక్షలతో వ్యక్తిపై హత్యాయత్నం

- బొలెరోతో ఢీ.. ముగ్గురిపై కేసు నమోదు

చౌదరిగూడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పాత కక్షలను మనసులో పెట్టుకొని ఓ వ్యక్తిని ముగ్గురు వ్యక్తులు బొలెరోతో ఢీకొట్టి చంపేందుకు యత్నించిన ఘటన కొందుర్గు మండలం చిన్నఎల్కిచర్ల శివారులో శనివారం చోటు చేసుకుంది. కొందుర్గు ఎస్సై కృష్ణయ్య, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నఎల్కిచర్లకు చెందిన అల్లి గోపాల్(35) ఇంటి నుంచి బయటికి వెళుతున్నానని చెప్పి వెళ్లిపోయాడు. చిన్న ఎల్కిచర్ల సర్కిల్ వద్దకు రాగానే పుల్లప్పగూడకు చెందిన విక్రం, లడ్డు, సురేష్‌లు బొలెరో వాహనంతో ఢీకొట్టి చంపేందుకు యత్నించారు. ఈక్రమంలో బొలెరో గోపాల్ పైనుంచి పోవడంతో కుడి చెవికి, కాళ్లకు, నడుముకు బలమైన గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా, తన భర్తను చంపేందుకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని గోపాల్ భార్య మల్లేశ్వరి ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణయ్య చెప్పారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

- 9 సెల్‌ఫోన్లతో పాటు రూ.లక్షా 17వేలు స్వాధీనం

కందుకూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టుచేసి వారినుంచి 9 సెల్‌ఫోన్లతో పాటు రూ.లక్షా 17వేల 670 స్వాధీనం చేసుకున్న ఘటన శనివారం కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సరస్వతిగూడలో చోటు చేసుకుంది. ఈమేరకు వారిని ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. సరస్వతిగూడలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 8మంది పేకాట ఆడుతున్నట్లు ఎస్‌వోటీ పోలీసులకు పక్కా సమాచారమందింది. ఈమేరకు దాడిచేసి 8మందిని అరెస్టు చేసి 9 సెల్‌ఫోన్లు, ఆరు డబ్బాల పత్తాలు, రూ.లక్షా17వేల670 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారందరినీ కందుకూరు పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారాం తెలిపారు.

చోరీ కేసులో నలుగురి రిమాండ్

మొయినాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గోడౌన్‌లో నగదు దొంగిలించిన నలుగురిని పోలీసులు అరెస్టుచేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని భరద్వాజ్ కాలనీలో పద్మావతి అసోసియేట్ పేరుతో ఓ గోదాం ఉంది. దానికి పెద్దమంగళారం గ్రామానికి చెందిన వినీత్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నాడు. ఈనెల 15న రాత్రి గోడౌన్ షట్టర్ పగులగొట్టి రూ.6 ఎత్తుకెళ్లారు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేశారు. మొయినాబాద్‌లో కిరాణా షాపు నడుపుతున్న సైతాన్‌రామ్ అనే వ్యక్తి అదే గోదాంలో కిరాణ సామాను కొనుగోలు చేసేవాడు. ఈ క్రమంలో బీరువాలో డబ్బులు పెట్టడాన్ని గమనించిన సైతాన్‌రామ్.. మొయినాబాద్‌లోని తనకు తెలిసిన బైక్ మెకానిక్ రామేశ్వర్‌కు చెప్పాడు. ఇద్దరూ కలిసి డబ్బు కాజేయాలని నిర్ణయించుకున్నారు. గోదాం వ్యక్తులు తమ ముఖాలను గుర్తుపడతారని భావించి.. కొంపల్లిలో ఉండే హులాస్‌ను, అతనితో పాటు ఓ ఫాంహౌస్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్న భవాని సింగ్ అనే వ్యక్తిని పిలిపించుకొని, గోదాం వెనకాల షట్టర్‌ను గడ్డపారతో పైకి లేపి బీరువాలో ఉన్న నగదు దొంగిలించారు. అదేరోజు నలుగురు నగదును సమానంగా పంచుకున్నారు. అయితే, సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి రూ.2లక్షల 96వేల నగదు, మహేంద్ర బొలెరో వాహనం, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరిచారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు.

మైసమ్మ ఆలయాభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు

కడ్తాల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మైసిగండి మైసమ్మ ఆలయం అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయినట్లు చెప్పారు. కడ్తాల మండలంలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని శనివారం ఎమ్మెల్యే సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన ఎ మ్మెల్యే కసిరెడ్డిని సీరోలిపంతు ఆధ్వర్యంలో నాయకులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైసిగండి వెల్జాల ఆలయాల అభివృద్ధికి రూ.25కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరగా మైసిగండి ఆలయానికి నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే వివరించారు.

అట్టహాసంగా ఎమ్మెల్యే కసిరెడ్డి జన్మదిన వేడుకలు

- ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గులలో ఘనంగా సంబురాలు
- కర్మన్‌ఘాట్, మైసిగండి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పెద్దసంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాధవి దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింహ, శ్రీనివాస్ రెడ్డి, అంజన్‌రెడ్డి



ఆమనగల్లులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి నాగలి బహూకరిస్తున్న వస్పుల శ్రీశైలం, నాయకులు



కడ్తాలలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో శనివారం అట్టహాసంగా నిర్వహించారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఆయా మండల కేంద్రాల్లో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కసిరెడ్డి నారాయణరెడ్డిమాధవి దంపతులు కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఉదయం కర్మాన్‌ఘాట్ ఆంజనేయ స్వామి దేవాలయంలో నారాయణ రెడ్డి దంపతులు, కుమారులు కృష్ణావంశీధర్ రెడ్డి, సోదరుడు వెంకట్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఏసీపీ రంగస్వామి, సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, ఎస్సైలు వెంకటేష్,శ్రీకాంత్, వరప్రసాద్, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సూదిని కొండల్ రెడ్డి, కాను శ్రీనివాస్‌రెడ్డి, జక్కు అనంతరెడ్డి, దారెడ్డి అంజన్‌రెడ్డి, రాజు, తిప్పిరెడ్డి నారాయణరెడ్డిలు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సందర్శించి పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ సీరోలి పంతూ, బీక్యానాయక్, జహంగీర్ అలీ, శ్రీకాంత్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, చందోజీ, శేఖర్‌గౌడ్, చేగూరి వెంకటేష్, భాస్కర్, జవహర్‌లాల్‌లతో కలిసి ఎమ్మెల్యే పూజలు చేశారు. కడ్తాల్‌లో పెద్దఎత్తున బాణసంచా పేల్చి ర్యాలీ నిర్వహించి మిఠాయిలు పంచారు. ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. నాయకులు గూడురు శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ్మ, భాస్కర్ రెడ్డి, బీచ్యానాయక్, అశోక్, భిక్షపతి. జహంగీర్ బాబా, తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండలం పడకల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ అంజయ్య, మోహన్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, శ్రీశైలం, అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, భగవన్ రెడ్డి, గుజ్జుల మహేష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. తలకొండపల్లిలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. రమేష్, కృష్ణ, అజీం, వెంకట్‌రెడ్డి, చెన్నకేశవులు, రవీందర్‌యాదవ్, తదితరులున్నారు. ఆమనగల్లు బస్టాండ్ ఎదుట కసిరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. నాయకులు ఎగిరిశెట్టి సత్యం, కండె పాండురంగయ్య, జగన్, కృష్ణానాయక్, శ్రీశైలం, గుర్రం కేశవులు, అప్పం శ్రీను, గాజుల శ్రీను, ఫరీద్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మాడ్గుల్‌లో రక్తదాన శిబిరం, జన్మదిన వేడుకలు నిర్వహించారు. నాయకులు భట్టు కిషన్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సాయిరెడ్డి, యాచారం వెంకటేశ్వర్‌గౌడ్, రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దళపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డికి పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ అగ్రనాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



తలకొండపల్లి మండలం పడకల్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



మైసిగండిలో శ్రీనివాస్ గౌడ్, భాస్కర్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేస్తున్న నారాయణరెడ్డి



మాడ్గులలో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపి కేక్ తినిపిస్తున్న నాయకులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేశంపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఈశ్వర్ శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా ఉండదన్నారు. సంగెం, పుట్టోనిగూడలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎంఆర్‌ఆర్ యువసేన మండలాధ్యక్షుడిగా శివయాదవ్



ఎమ్మెల్యే మల్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకుంటున్న మంతని శివయాదవ్

మంచాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌ఆర్ యువసేన మంచాల మండల అధ్యక్షుడిగా అస్మత్‌పూర్ గ్రామానికి చెందిన మంతని శివయాదవ్ నియమితులయ్యాడు. శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు. రాష్ట్ర నేత విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్ రెడ్డి, జంగయ్యయాదవ్, పాత్లోత్ శ్రీనివాస్, పెర్కమూర్తి, ఏర్పుల రాజు, ఓరుగంటి లింగం, బద్దుల ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆమనగల్లు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణానికి చెందిన శృతిలయ కల్చరల్ అకాడమీ, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 8 జిల్లాల్లో వేసవి సంగీత, నృత్య, లాంగ్వేజ్, లాజిక్, లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ చిత్తరంజన్ తెలిపారు. శిబిరాలకు సంబంధించి పోస్టర్లను శనివారం ముచ్చింతల్ ఆశ్రమంలో చినజీయర్ ఆవిష్కరించారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి అత్యుత్తమ పాలసీ రూపొందించి అమలు చేస్తున్నట్లు పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మైసిగండిలో ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. శ్రీనివాస్ గౌడ్ బహుమతులు అందజేశారు.

ఇబ్రహీంపట్నం : ఈ నెల 25 నుంచి నాలుగు రోజులపాటు సంగారెడ్డిలో జరుగనున్న సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య కోరారు. శనివారం ఇబ్రహీంపట్నంలో మహాసభలకు సంబంధించి పోస్టర్‌ను విడుదల చేశారు. మండల కార్యదర్శి బుగ్గరాములు, కార్యదర్శి ఎల్లేష్, ముసలయ్య, శంకర్ తదితరులున్నారు.

చౌదరిగూడ : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని బిత్తిరిసత్తి అలియాస్ కావలి రవికుమార్ అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలో పెరుమాళ బ్రదర్స్ గ్రౌండ్‌లో పండగల సాయన్న ముదిరాజ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, కావలి యాదయ్య, శివశంకర్, క్రీడాకారులున్నారు.

యాచారం : మండలంలోని కుర్మిద్ద సమీపంలోని మర్లకుంట తండా రోడ్డులో సర్వే నెంబర్ 311లో హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌ను నిర్మించడానికి రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు మూడు ఎకరాల భూమి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవల ప్రతిపాదనలు పంపించారు. ఇక్కడ పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణం చేపడితే ఫార్మాసిటీ పరిధిలోని యాచారం, కందుకూరు మండలాల వాసులకు అనువుగా ఉంటుందని రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు అన్ని వివరాలతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. భూమి కేటాయించడంతో పాటు అందుకు తగిన నిధులను కేటాయిస్తూ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు ఇస్తే.. భవనం నిర్మించడానికి రాష్ట్ర పోలీస్ శాఖ గృహనిర్మాణ విభాగం తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

కడ్తాల్ : సామాజిక సేవా ప్రజా చైతన్య కార్యక్రమాలలో స్వచ్ఛంద సంస్థలు యువజన సంఘాలు పోటీ పడాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్యసంఘం నాయకుడు లయన్‌సక్లబ్ సభ్యుడు గంప శ్రీను ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకేశవ రెడ్డి, గంప శ్రీనుతో కలిసి ప్రారంభించారు.

షాద్‌నగర్ రూరల్ : గిరాయగుట్ట తండా జీపీలో మురుగు కాలువల నిర్మాణానికి సిద్ధి వినాయక డెవలపర్ యజమాని కుమార్ నాయక్ 100 పైపులు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఆయన్ను తండా యువకులు ఘనంగా సన్మానించారు.

కందుకూరు : సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, కందుకూరు మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు అన్నారు. సాయిరెడ్డిగూడ, నేదునూరు, సరస్వతిగూడ, పులిమామిడి, బేగరికంచ గ్రామాలకు చెందిన 10మందికి చెక్కులందించారు.

రోగ నిర్ధారణకు పరీక్ష!


(5వ పేజీ తరువాయి)

రోగులు ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో రోగులు అల్లాడుతున్నారు.

పేదలకు రక్త పరీక్షల భారం తీరటం లేదు.. ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేయక తప్పడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల టెస్టులు అందని ద్రాక్షలా మారింది. తెలంగాణ డయోగ్నస్టిక్ హబ్ పేరుతో సర్కారు వికారాబాద్ జిల్లా కేంద్రంలోకి అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ కేంద్రం ద్వారా ఒకే సారి 57 రకాల రక్త, మూత్ర, అవయవాల పనితీరు వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారు. గత రెండేళ్ల క్రితం ఈ కేంద్రాన్ని అందుబాలోకి తీసుకువచ్చినా ప్రయోజనం లేకుండా పోతుంది. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన ఈ తెలంగాణ డయోగ్నస్టిక్ హబ్ పరిధిలోకి ఆలూరు, బంట్వారం, బషీరాబాద్, బొంరాస్‌పేట్, చందనవెల్లి, చన్‌గోముల్, చేవెళ్ల, చిట్యాల్, ధారూరు, దోమ పీహెచ్‌సీలతో పాటు కొడంగల్ సీహెచ్‌సీ, కొడంగల్ పీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే కొందుర్గు, కోట్‌పల్లి, కుల్కచర్ల, మర్పల్లి, మొయినాబాద్, మోమిన్‌పేట్, నాగసముద్ర, నవల్గా పీహెచ్‌సీలు, పరిగిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు పెద్దేముల్ పీహెచ్‌సీ, పూడూరు, రామయ్యగూడ, షాబాద్, శంకర్‌పల్లి, సిద్దులూరు పీహెచ్‌సీలు ఉన్నాయి. తాండూరు డీహెచ్‌తో పాటు యూపీహెచ్‌సీ, తాండూరు ఎంసీహెచ్,తాండూరు పీహెచ్‌సీ, వికారాబాద్‌లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, అలాగే యుపీహెచ్‌సి ఉన్నారు. యాలాల పీహెచ్‌సీ, తాండూరు, వికారాబాద్, కొడంగల్‌లోని బస్తీదవఖానాలు తెలంగాణ డయోగ్నస్టిక్ హబ్ పరిధిలో ఉన్నాయి. రెండు జిల్లాల్లో 40 ప్రభుత్వ ఆసుపత్రులను ఈ ల్యాబ్‌కు అనుసంధానం చేశారు. ఈ సెంటర్‌లో ఒకే సారి రక్త, మూత్ర, అవయవ పనితీరు, థైరాయిడ్, లివర్, కిడ్నీ పనితీరు, కొలెస్ట్రాల్, చికున్‌గున్యా, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, క్యాల్షియం, సీరమ్ క్రియటినైన్, డీహెచ్‌డీఎల్, ఎలక్ట్రరేట్స్, హెచ్‌బీఎస్‌హెచ్‌జీ వంటి 57 రకాల పరీక్షలు చేస్తారు. వీటితో పాటు ఖర్చుతో కూడుకున్న టీస్కాన్, 2డీ ఈకో, అల్ట్రాసౌండ్, మ్యామోగ్రఫి లాంటి స్కానింగ్ పరీక్షలు కూడ నిర్వహిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి నమూనాలను జిల్లా కేంద్రాలోకి డయోగ్నస్టిక్ సెంటర్‌కు చేరవేసేందుకు ప్రత్యేక వాహన వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లాలో దూరాన్నిబట్టి ఒకటి, రెండు లేదా మూడు రూట్లుగా విభజించారు. ప్రతి రోజు జిల్లా కేంద్రం నుంచి బయలుదేరి పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నుంచి నమూనాలను ఐస్‌బాక్స్‌లో పెట్టుకుని తిరిగి మధ్యాహ్నం వరకు ల్యాబ్‌కు చేరుకుంటారు. ఆన్‌లైన్‌లో రోగి పేరు, బార్‌కోడ్, వివరాలు నమోదు చేస్తారు. ఆ నమూనాలను జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయోగ్నస్టిక్ కేంద్రానికి చేరుస్తారు. అన్ని ఆసుపత్రుల నుంచి తీసుకువచ్చిన నమూనాలను పరీక్ష చేసి నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపర్చుతారు. ఆయా పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రింట్ తీసి రోగికి అందజేస్తారు. కానీ.. గత 12 రోజుల నుంచి ఆన్‌లైన్‌లో నివేదికలు రావడం లేదు. రక్త నమూనాలు ఇచ్చిన రోగులంతా రోజు టెస్ట్ రిపోర్ట్ కోసం ఎదురు చేస్తున్నారు. రక్త పరీక్షల ఫలితాలు రావడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటతో రోగుల రోగం కాస్త ముంది ప్రాణాలు పోయే దుస్థితి ఏర్పడుతుంది. రక్త పరీక్షల ఫలితాల కోసం ఎదురుచూసి చివరకు కొందరు రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. డబ్బు లేని నిరుపేదలకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. తెలంగాణ డయోగ్నస్టిక్ సెంటర్ లేక ముందు స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే కొన్ని రకాల పరీక్షలు జరిగేవంటున్నారు.

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన ఈ తెలంగాణ డయోగ్నస్టిక్ హబ్‌లో యంత్రాలు పాడవడంతో 12 రోజుల నుంచి టెస్టులు నిలిచిపోయాయి. ఒక్కో పీహెచ్‌సీ, బస్తీదవఖానాల నుంచి రోజుకు 20-30 నమూనాలు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌నుంచి రోకు 40-55 రక్తనమూనాలు వెళ్లేవి. డయోగ్నస్టిక్ సెంటర్‌లో యంత్రాలు పాడవడంతో వందలాది మంది రోగులు రక్త పరీక్షలకు ప్రైవేట్ డయోగ్నస్టిక్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. చేవెళ్ల, వికారాబాద్, పరిగిలో డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. మూడు షిఫ్టుల్లో రోజుకు 15 మంది ఒక్కో సెంటర్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. కానీ.. డయాలసిస్ చేయాలంటే.. ముందుగా సీబీపీ, ఆర్ఎఫ్‌టి, ఎల్ఎఫ్‌టి రక్తపరీక్షలు తప్పనిసరి. ఈ పరీక్షలు చేశాక వచ్చిన రిపోర్టు ఆధారంగా డయాలసిస్ చేస్తారు. కానీ.. సీబీపీ, ఆర్ఎఫ్‌టీ, ఎల్ఎఫ్‌టీ రక్తపరీక్షలు ప్రైవేట్‌లో రూ. 1500 చెల్లించి చేయించుకుంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ డయోగ్నస్టిక్ సెంటర్‌లో థైరాయిడ్ టెస్టు మినహా ఏ ఒక్క టెస్టు చేయడం లేదు. గత 12 రోజుల నుంచి రక్తనమూనాలు ఎందుకు తీసుకోవడం లేదనే విషయాన్ని వికారాబాద్‌లోని తెలంగాణ డయోగ్నస్టిక్ హబ్ మేనేజర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. మిషన్ పనిచేస్తుందని చెప్పారు. వెంటనే చేవెళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న టెక్నీషియన్‌కు ఫోన్ చేయగా.. బయో కెమిస్ట్రీ శాంపిల్ తీసుకోవడం లేదని, మిషన్ పనిచేయడం లేదని చెప్పారు. అయితే, రక్త పరీక్షల్లో ఆర్ఎఫ్‌టీ, టీఎఫ్‌టీ రావడం లేదని తెలిపారు.

రక్తం తీసుకుంటున్నారు.. రిపోర్టు ఇవ్వడం లేదు



రక్త పరీక్షలు రక్తం తీసుకుంటున్నారు. కానీ.. రిపోర్టు రావడం లేదు. రిపోర్టుల కోసం ల్యాబ్‌కు వెళితే.. వికారాబాద్‌లో మిషన్ మొరాయిస్తుందని, అందుకే రిపోర్టు రాలేదని టెక్నీషియన్ చెబుతున్నారు. డయాలసిస్‌కు తప్పనిసరిగా రక్త పరీక్ష చేయాలి. లేదంటే డయాలసిస్ చేయరు. దీంతో ప్రైవేట్‌లో టెస్టులు చేయించాల్సి వస్తుంది. టెస్టుల కోసం అవుతున్న ఖర్చు భారంగా మారుతుంది. వారం పది రోజుల నుంచి మిషన్ మొరాయిస్తుండటంతో ఇబ్బంది అవుతుంది.

- టీ.కృష్ణ, ఆలూరు, డయాలసిస్ పేషెంట్, చేవెళ్ల మండలం